క్లుప్తంగా

మంత్రి వనితకు ఆహ్వానం



మంత్రి వనితకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో వచ్చే నెలలో జరిగే అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవానికి హాజరుకావాలని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితను ఎమ్మార్పీఎస్ నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న, కోటనందూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ దండోరా కమిటీ చైర్మన్ ఆరుగుల మోషే మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుత్తలపూడి రమణ, తాతపూడి రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కిర్లంపూడి: మండల పరిధిలోని రామచంద్రపురం, వీరవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీఓ బి.చిరంజీవిరావు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ జాబ్ కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలన్నారు. ఉపాధి పనులు పారదర్శకంగా చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు సతీష్, వీరబాబులను ఆదేశించారు. ఆయన వెంట పలువురు ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రికి ఇనుప రాక్ వితరణ



తుని ఏరియా ఆసుపత్రికి ఇనుప రాక్‌ను బహూకరించిన దాత రమణతో సిబ్బంది

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఓ దాత ఇనుప రాక్‌ను బహూకరించినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్న గురువారం తెలిపారు. కోటనందూరు మండలం బొద్దవరం గ్రామ ఉపసర్పంచ్ యల్లపు రమణ ఆసుపత్రికి ఇనుప రాక్‌కు అందజేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్ఫూర్తితో ఆసుపత్రికి చిరు కానుక అందించినట్టు దాత రమణ తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొరబాబు, యల్లపు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు

శంఖవరం: రబీ వరి సాగులో ఎరువుల యాజమాన్యం పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ పేర్కొన్నారు. శంఖవరంలో గురువారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. గ్రామంలో దమ్ములు చేస్తున్న పొలాలు, వరి నాట్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ సాగు చివరి దమ్ములో సూపర్ ఫాస్ఫేట్ ఎరువు వేయాలన్నారు. జింక్ లోపం రాకుండా ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్ దమ్ములో వేయాలన్నారు. దాల్వా సాగు చేస్తున్న ప్రతి రైతు ఆర్‌బీకేల్లో పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు

జగ్గంపేట: మండలంలోని మల్లిపాకలో తదేకం ఫౌండేషన్, జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల రంగవల్లులు వేశారు. విజేతలకు తదేకం ఫౌండేషన్ సౌత్ రీజియన్ కోఆర్డినేటర్ మండలపు మాధవీ లత, యార్లగడ్డ సాయి సుధ, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ చల్లా లక్ష్మి, జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన గంటా కరుణ అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా మల్లిపాక గ్రామ జనసేన నేత బీడీల రాజబాబు ఆధ్వర్యంలో ఆమెకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, మందుల ఖర్చులకు రూ.6 వేలు అందజేశారు.

గ్రామాల్లో 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి'

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం, వేములపాలెం, చినశంకర్లపూడి గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూతంత ఆనందమే

- మామిడి తోటల్లో ఆశాజనకంగా పూత
- నియోజకవర్గంలో 2156 హెక్టార్లలో మామిడి సాగు
- తేనేమంచుతో పూతకు దెబ్బ



ప్రత్తిపాడులో విరగబూసిన మామిడి చెట్లు



పూత వచ్చేందుకు మందులు పిచికారీ చేస్తున్న రైతులు



మంచుకు మాడిపోతున్న మామిడి పూత

ప్రత్తిపాడు రూరల్: మెట్టలో మామిడి పూత ఈ ఏడాది ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రైతులు ఉద్యాన, వాణిజ్య పంటను మామిడిని సాగు చేస్తున్నారు. ఇక్కడ పండిన మామిడి కాయలు ఏటా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ఈ ఏడాది పూత కాస్త ఆలస్యమైనా బాగుండడంతో రైతులు దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో ఈ ఏడాది 2156 హెక్టార్లలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ప్రత్తిపాడు మండలంలో 742, ఏలేశ్వరం మండలంలో 43, శంఖవరం మండలంలో 825, రౌతులపూడి మండలంలో 546 హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. మామిడి పూత సాధారణంగా డిసెంబర్– జనవరి నెలల్లో మొదలై ఫిబ్రవరి వరకూ పూస్తుంది. కాగా గత అక్టోబర్, నవంబర్ నెలల్లో అధిక వర్షాలు కురవడం వల్ల ఈ ఏడాది 15 రోజులు ఆలస్యంగా పూత వచ్చినట్లు ఉద్యానవన శాఖ అధికారి వెన్నెల తెలిపారు. గతేడాది ఇదే తరహాలో మామిడి పూత ఆలస్యంగా వచ్చింది. వచ్చిన పూత పెద్దగా నిలబడలేదు. ఈ ఏడాది పూత బాగానే ఉంది. కొన్ని చోట్ల పిందెలు కూడా దిగాయి.

యాజమాన్య పద్ధతులతో మేలు

మామిడి సాగులో ఎనిమిది నెలల పాటు చేపట్టే యాజమాన్య పద్ధతులు ఒక ఎత్తయితే, పూత దశ నుంచి కోత దశ వచ్చే నాలుగు నెలల్లో చేపట్టే సస్యరక్షణ చర్యలు మరో ఎత్తు. మామిడిలో పూతంతా ఒకేసారి రాదు. పూత ఒకేసారి రాకపోవడంతో సస్యరక్షణ చర్యలు చేపట్టడం, కోత కోయడంలో రైతులకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు మొగ్గ బయటకు వచ్చే ముందు తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి. మొగ్గ బయటకు వచ్చే ముందు లేక పగిలే సమయంలో పొటాషియం నైట్రేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ముంచుతున్న మంచు

ప్రస్తుతం జిల్లాలో చల్లటి వాతావరణం నెలకొంది. మామిడి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. ప్రధానంగా తామర పురుగు, పూత రాలిపోవడం, చెట్లకు పూత పట్టకపోవడం, పూత పసుపు, నల్ల రంగుల్లోకి మారిపోతోంది. పూత సమయంలో చెట్టకు నీరు పారించినా పూత రాలుతుంది. పూత, పిందె దశల్లోనే ఎరువులు వేయడంతో ప్రయోజనం ఉండదు. ఇష్టానుసారంగా మందులు పిచికారీ చేసినా పూత రాలిపోతుంది. మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

తామర పురుగు ఆశిస్తోంది



ప్రస్తుతం మామిడి పంటను తామర పురుగు ఆశిస్తోంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పూత సమయంలో ఆశిస్తే పూత, చిన్న పిందెలు రాలిపోతాయి. వీటి నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2.0 మిల్లీ లీటర్ల మందును నీమ్ ఆయిల్‌తో లీటరు నీటిలో కలిపి చెట్టుపై పిచికారీ చేయాలి.

– కె.వెన్నెల, ఉద్యానవన శాఖ అధికారి, ప్రత్తిపాడు

ఆలస్యంగా పూత



ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమైంది. ఏటా నవంబర్‌లో పూత ప్రారంభమై డిసెంబర్‌కు ముగుస్తుంది. అయితే ఈ ఏడాది ఇంకా పూత వస్తూనే ఉంది. ఫిబ్రవరిలో మామిడి పూత దశ నుంచి పిందె దశకు చేరుకుంటుంది. కాగా ఈ ఏడాది ఇప్పటికీ పూత దశలోనే మామిడి పంట ఉండటంతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులపై ఆందోళన కలుగుతోంది.

– పిల్లి రాజబాబు, మామిడి రైతు, వేములపాలెం

అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాల కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

సాక్షి ఇంపాక్ట్

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించినట్టు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో గతంలో బహిరంగ మరుగుదొడ్లు ఉండగా సుప్రీం కోర్టు తీర్పు నిమిత్తం వాటిని తొలగించారు. ఆ స్థలాలు గత ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై ఈ నెల 10న 'నిరుపయోగంగా ప్రభుత్వ స్థలాలు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం కమిషనర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. కార్యక్రమంలో టీపీఎస్ ఆనంద్, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, కోనాల వెంకటరమణ, వీఆర్వో అవసరాల కిషోర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఒంటిమామిడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఒంటిమామిడిలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఒంటిమామిడిలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటా పర్యటించారు. గత మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, వీధి దీపాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలి

నియోజకవర్గంలో సుమారు 18 వేల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నాయని, ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలని మంత్రి రాజా ఫోన్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు సూచించారు. పలు గ్రామాల రైతులు ధాన్యం కొనుగోళ్ల సమస్యలను మంత్రి రాజా దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో ఆయన జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, గాబు రాజు, ఎంపీటీడీ పసపులేటి సతీష్, పంచాయతీ సర్పంచ్ అంగుళూరి సుధాకర్, ఉపసర్పంచ్ గోసల కిషోర్, పెనుమత్స నాని, పెదపూడి రమణ, కొయ్యా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- గుమ్మరేగులలో గడప గడపకూ మన ప్రభుత్వం



గుమ్మరేగులలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని గుమ్మరేగులలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్ ఎంపీపీలు సూరెడ్డి సాయి తిరుములరాయల్, వాసిరెడ్డి లక్ష్మీభాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరుపై ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా కాపుల వీధిలో రామాలయ నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. జిల్లా పరిషత్ గ్రాంట్ నుంచి నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, తాగు నీరు, వీధి లైట్లు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం సుమారు 300కు పైగా గృహాలను సందర్శించి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే పంచాయతీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఉప్పంపాలెం సర్పంచ్ కోటిబాబు, పార్టీ నాయకులు ప్రసాద్, నాని, శ్రీను పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

తుని రూరల్: రైతులు, బియ్యం వినియోగదారులకు నష్టం కలిగిస్తున్న ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేయనున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వెల్లడించారు. గురువారం రాత్రి కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో బస్తా ధాన్యాన్ని రూ.1100 నుంచి రూ.1300లకు రైతులు అమ్ముకోవలసిన పరిస్థితులు తలెత్తాయన్నారు. దీనివల్ల రైతులకు, బియ్యం వినియోగదారులకు నష్టం కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రివ్యూలు చేస్తే సరిపోదని, సివిల్ సప్లై డిపార్టుమెంట్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. సివిల్ సప్లై డీఎం ఆదాయం ఎంత, సంపాదిస్తుంది ఎంత అన్న విషయాలను ప్రభుత్వమే తెలుసుకోవాలన్నారు. సివిల్ సప్లై డిపార్టుమెంట్‌పై గత ప్రభుత్వాల నుంచి నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం రైతులకు ప్రయోజనం కల్పించే విధంగా గిట్టుబాటు ధర ప్రకటిస్తే ఆ ధర దక్కడం లేదన్నారు. ఈ మోసాల నుంచి రైతాంగాన్ని రక్షించేందుకు ఉద్యమం చేస్తామన్నారు. ఈ నెల 24న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి ఉద్యమం లేవనెత్తుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం గోసంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంలేదన్నారు. తునిలో గోవులను వధించి వేర్వేరు ఉత్పత్తులు తయారు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన

గండేపల్లి: విద్యార్థులకు కృషి, పట్టుదల, తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జేమ్స్ వాట్ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత జేమ్స్‌వాట్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జేమ్స్ వాట్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టడంతోనే పారిశ్రామిక విప్లవం మొదలైందన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో జేమ్స్‌వాట్ పరిశోధనలకు మెచ్చిన లండన్ ప్రభుత్వం 1785లో ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీకి ఎంపిక చేసిందని తెలిపారు. విద్యార్థులు అంతటి గొప్ప ఖ్యాతిని పొందాలని ఆకాంక్షించారు. డీన్ పీఎస్‌వీవీఎస్ రవికుమార్, వివిధ విభాగాధిపతులు, గ్రంథాలయ అధికారులు కె.అశోక్ కుమార్, కె.వెంకటరమణ, అఖిలేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

తూర్పుకాపుల కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయిస్తాం

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఇర్రిపాకలో తూర్పుకాపు సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామంలో తూర్పుకాపుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండలంలోని ఇర్రిపాకలో ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆవిష్కరించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పోలవరం కాలవగట్టు ప్రాంతంలో కాకుండా వేరే ప్రదేశంలో తమకు స్థలం ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తూర్పుకాపు సంఘం నేతలు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే చంటిబాబు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డుకొండ వెంకట రమణ, సంఘ నేతలు టి.వెంకటరమణ, ఎం.సత్యనారాయణ, బూర్ల అప్పలరాజు, ఆకుల సూరి అప్పారావు, కోరాడ సుబ్బారావు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు




ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడులో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ మేరకు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు జరగడం విచారకరమన్నారు. న్యాయం కోసం వచ్చిన వారికి సేవలు అందించడమే తప్ప తమకు ఎటువంటి వ్యక్తిగత ద్వేషాలు ఉండవన్నారు. ఈ నేపథ్యంలో క్లైయింట్లు న్యాయవాదులపై దాడులకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించి, దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను న్యాయమూర్తి కాటం భాను, ప్రత్తిపాడు సీఐ కె. కిషోర్‌బాబులకు అందజేశారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి రాజాల చిట్టిబాబు, సీనియర్ న్యాయవాది అనిశింగరాజు కుక్కుటేశ్వరరావు, లేడీ రిప్రజెంటేటివ్ అవసరాల దేవి, బార్ ప్రతినిధులు రమణం వెంకట్రావు, పిల్లి బలరాముడు, పోతుల జోగేష్, అత్యుత్ రామారావు, ఆకుల హరిబాబు, పలివెల నాగేంద్ర, లోవదుర్గ పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళులు



తునిలో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



కోటనందూరులో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తుని రూరల్: కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతల రమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్‌డీ ఎస్.జయరామ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహామండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ జి.అరుణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి ఎంపీపీ అత్తులూరి నాగబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీడీఓ హరికృష్ణ, ఈఓపీఆర్డీ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన శతకం జీవిత పరమార్థానికి నిదర్శమన్నారు. యోగి వేమన పద్యాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ మూది నారాయణస్వామి, సుంకర రాంబాబు, దేగల వెంకటరమణ, వాగు బలరామ్, పైల శ్రీధర్, బోద చిరంజీవిరావు, టీపీఎస్ ఆనంద్ పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వేమన చిత్రపటానికి కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



జగ్గంపేటలో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



ఆటోడ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ సూర్యఅప్పారావు

జగ్గంపేట: ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే వైద్యసేవలు అందించి వారి ప్రాణాలను కాపాడేందుకు ఆటో డ్రైవర్లు కృషి చేయాలని జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు కోరారు. జగ్గంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో గురువారం ఆటో యూనియన్ సభ్యులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినపుడు కేసులకు భయపడి గాయపడ్డ వారిని వదిలి వేసి వెళ్లి పోవడం సరికాదన్నారు. మానవత్వంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలన్నారు. ఆటో డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు పాల్గొన్నారు.